నేటి కందం- నేటికి అందం

క్షేమంకరమగు స్నేహ
మ్మామని వలె పరచుకొనగ నాత్మీయతతో
కామను వెల్తు దినంబును
కామనతో జరుపవలయు కమ్మని గతిలోన్

(మే 24 కామన్ వెల్త్ దినోత్సవం)



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

సామాజిక విముక్తికై
జనించిన భావాలు
చంపేస్తే చావబోవు
చైతన్యపు సజీవాలు
కాలం చెల్లిందనే వాళ్ల
కట్టుకథలు అసత్యం
సమస్యలు ఉన్నవరకు
సాగుతాయి అవి నిత్యం

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 24-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:223 పేజీలు:6 వెల: రూ.1/-


## బసవేశ్వరుడి స్ఫూర్తితో తెలంగాణలో పాలన - రేవంత్ రెడ్డి

**-హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**
**-పూర్ణకుంభంతో స్వాగతం పలికిన పండితులు**
**-వేదమంత్రాల నడుమ బసవేశ్వరుడి విగ్రహం ప్రారంభం**



మెదక్, 23: సంగారెడ్డి జిల్లా హుగ్గెల్లిలో ఏర్పాటు చేసిన బసవేశ్వరుని విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించారు. బేగంపేట ఎయిర్పోర్ట్ నుండి హెలికాప్టర్ లో జహీరాబాద్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐజీ సత్యనారాయణ, ఎంపీ సురేష్ షెట్కర్, ఎంపీ కాంటెస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు తదితరులు హెలిపాడ్ వద్ద స్వాగతం పలికారు. హుగ్గెల్లిలో బసవేశ్వరుడి విగ్రహం వద్ద వేద పండితులు, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్ లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

బసవేశ్వరుడి విగ్రహ ప్రారంభోత్సవం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విశ్వగురు బసవేశ్వరుని స్ఫూర్తి, ఆలోచన విధానంతో బసవేశ్వరుని దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం జన గణనలో కుల గణన చేసి చూపెట్టిందని తెలియజేశారు. భారత జోడో యాత్రలో రాహుల్ గాంధీ అడుగడుగున మహాత్మా జ్యోతి రావు పూలే, మహాత్మా గాంధీ, బసవేశ్వరుడు స్ఫూర్తితోసామాజిక న్యాయాన్ని ప్రజలందరికీ అందజేయాలని ఆయన ఆక్షించారని ఆయన సూచనలతోనే తెలంగాణలో కుల గణన చేసి చూపించామన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ , జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, ఎంపీ సురేష్ షట్కర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, జిల్లా లింగాయత్ సమాజా నాయకులు గురువులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్ - నలుగురు మావోయిస్టుల మృతి

వరంగల్, మే 23: కవండే సమీపంలో మహారాష్ట్ర -ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులు ఉన్నట్లు అందిన విశ్వసనీయ నిఘా ఆధారంగా, అదనపు ఎస్పీ రమేష్ మరియు 12 సీ60 పార్టీలు (300 కమాండోలు), సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలోని ఒక ఆపరేషన్ గురువారం నుంచి ప్రారంభించారు. కవాండే , నెల్గుండ నుండి ఇంద్రావతి ఒడ్డు వైపు భారీ వర్షం కురుస్తున్న సమయంలో సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు.

శుక్రవారం ఉదయం కార్డన్ వేసి నది ఒడ్డున సోదాలు చేస్తుండగా, మావోయిస్టులు సీ60 కమాండోలపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం ప్రారంభించారు, దీంతో పోలీసులు ఎదురుకాల్పులు ప్రారంభించారు. దాదాపు రెండు గంటల పాటు అడపాదడపా కాల్పులు కొనసాగాయి. ఈ ప్రాంతంలో పోలీసుల జరిపిన సోదాల్లో నలుగురు మావోయిస్టుల మృతదేహాలు, ఒక ఆటోమేటిక్ సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, రెండు .303 రైఫిల్ మరియు ఒక భార్మర్ ను స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు, వాకీ టాకీలు, క్యాంపింగ్ సామగ్రి, నక్సల్ సాహిత్యం మొదలైనవి సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో మహిళలకే పెద్దపీట

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రూ. 494 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం**



మెదక్, 23: సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన ప్రగతి బాట కింద శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 494.67 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత కేంద్రీయ విద్యాలయం అనంతరం పస్తాపూర్ సభాస్థలి వద్ద జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో నిర్మించిన 9 కిలో మీటర్ల గ్రీన్ కారిడార్ నిమ్జ్ రోడ్డు, రూ.100 కోట్లతో జహీరాబాద్ పట్టణంలో నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిం చారు. చిరాగ పల్లి-ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం( గుమ్మడిదల) ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పస్తాపూర్ సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్ లను సందర్శించిన మహిళా సంఘాలతో ముచ్చటించారు.

అనంతరం రూ.2 కోట్ల తో 3 షిఫ్ట్ ల వారిగా మహిళా సహకార సంఘాలు నిర్వహించబోయే ఇండియన్ ఆయిల్ ఔట్ లెట్ ను ప్రారంభించారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్ద పీట వేస్తుందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా మద్దతుగా, వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. కుటుంబానికి మహిళే వెన్నుముక అని మహిళ రాణిస్తే కుటుంబం మొత్తం రాణిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ షట్కర్, టీ జీ ఐఐ సీ ఛైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎంపీ కాంటెస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు, నిమ్జ్ అధికారులు,

మేఘా అధికారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ - కవిత లేఖపై మంత్రి పొన్నం

హైదరాబాద్, మే 22:కాంగ్రెస్ ఆరోపణలకు బలం చేకూర్చేలా ఎమ్మెల్సీ కవిత లేఖ ఉందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ లో నేడు మీడియాతో మాట్లాడుతూ ఏనాడు బీజేపీ , బీఆర్ఎస్ పార్టీలు వేరు కాదనే విషయం మరోసారి వెలుగులోకి వచ్చిందని అన్నారు. ఆ రెండు పార్టీల వ్యవహారం గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ అన్న చందంగా ఉందని మండిపడ్డారు. బీజేపీ ఎందుకు బీఆర్ఎస్ ను ప్రశ్నించడం లేదని కాంగ్రెస్ ప్రశ్నిస్తే.. రాజకీయం అన్నారని.. ఇప్పుడు అదే విషయంలో కేసీఆర్ కూతురే అడుగుతుందని, దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందాలు

ఇటీవల కాలంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందాలు చేసుకున్నాయని మంత్రి ప్రభాకర్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గులాబీ పార్టీకి పూర్తిగా సరెండర్ అయిపోయిందంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో బీజేపీపై కేసీఆర్ ఎలాంటి కామెంట్ చేయకపోవడాన్ని కవిత జీర్ణించుకోలేకపోయిందని, అందుకే అన్ని విషయాలను ఆమె లేఖ ద్వారా బయటపెట్టిందని అన్నారు. కవిత రాసిన లేఖపై కేటీఆర్ తో పాటు హరీశ్ రావు కూడా సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం అన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన పాలేరు సాగర్ అండర్ టన్నెల్ పనులు - మంత్రి పొంగులేటి



ఖమ్మం, మే 23: ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యూటీ) పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే జూలై 10వ తేదీనాటికి పూర్తిచేసి వానాకాలం సీజన్‌కు రైతాంగానికి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రూ.14.2 కోట్లతో యూటీ కాలువ మరమ్మతులు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావు పేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ (యూటీ) కొట్టుకపోయిందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించారు. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యూటీ కాలువ మరమ్మతులను ప్రారంభించామన్నారు. ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామని చెప్పారు. దీనివల్ల ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో అవసరమైతే రోజుకు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణపనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## గేట్‌వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ ను చేస్తాం- రేవంత్ రెడ్డి



సంగారెడ్డి, 23: జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో నిర్మించిన జహీరాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని, మాచనూర్ లో రూ.26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని నేడు ఆయన ప్రారంభించారు. నియోజవర్గ వ్యాప్తంగా రూ.494.67 కోట్లతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలోని హుగ్గెల్లి చౌరస్తాలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మెదక్ జిల్లాతో ఇందిరా గాంధీది వియ్యదీయరాని అనుబంధమని తెలిపారు. ఆమె మెదక్ ఎంపీగా కొనసాగుతుండగానే అమరులవ్వడం బాధకరమని అన్నారు.

మెదక్ జిల్లాకు, దివంగత ప్రధాని ఇందిరా గాంధీకి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకుంటూ, "మెదక్ జిల్లా అంటే ఇందిరమ్మ, ఇందిరమ్మ అంటే మెదక్ జిల్లా" అని, ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ మరిచిపోదని అన్నారు. ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, అవసరమైన నిధులను కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. పటాన్‌చెరు ప్రాంతం ఒక మినీ ఇండియా లాంటిదని, ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలోనే ఈ ప్రాంతంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని సీఎం గుర్తుచేశారు. సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. జహీరాబాద్ అభివృద్ధిలో గీతారెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

### గేట్‌వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్

మెదక్ జిల్లా ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్టీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేస్తామని అన్నారు. జహీరాబాద్ పారిశ్రామిక వాడ భూసేకరణలో అన్యాయం జరిగిందనే విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. భూమిలిచ్చిన రైతులకు పరిహారం పెంచామని తెలిపారు. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు కేటాయిస్తామని కామెంట్ చేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పోతామని తెలిపారు. ముఖ్యంగా నారాయణ ఖేడ్ అభివృద్ధికి ప్రత్యేకంగా సమీక్ష చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం

భవిష్యత్తులో మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని సీఎం అన్నారు. సింగూరు ప్రాజెక్ట్‌ను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేస్తామని తెలిపారు. అందుకు త్వరలోనే నిధులు కూడా మంజూరు చేస్తామని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చి వెంటనే రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి చేశామని పేర్కొన్నారు. రైతు భరోసా పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. గత ప్రభుత్వంలోని నాయకులు వరి వేస్తే ఉరే అని చెప్పేవారని రాష్ట్రంలో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణిస్తున్నారని.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత్ ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కంకణం కట్టుకున్నామని అన్నారు. అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సాయం తీసుకుంటాం

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకుంటామని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రధాని మోదీని ఎన్నిసార్లయినా కలుస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని చెప్పారు.

ప్రతిపక్షనేతకు వినతి

ప్రతిపక్ష నాయకుడికి తాను విజ్ఞప్తి చేస్తున్నాని, శాసనసభకు రావాలని, ప్రజా సమస్యలపై చర్చించాలని సీఎం అన్నారు. తాము ఏదైనా తప్పులు చేస్తే సూచనలు ఇవ్వండి.. సరిదిద్దుకుంటామన్నారు. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామని మీరు అనుకుంటే.. ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ప్రజాప్రతినిధులుగా నిత్యం ప్రజలకు అండగా ఉండాలని, గెలిచినా, ఓడినా ఎప్పుడూ ప్రజల్లోనే తాను ఉన్నానని చెప్పారు. సీఎం అయ్యాక కూడా తాను ఏనాడు అహంభావం ప్రదర్శించలేదని చెప్పారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా పథకాన్ని అమలు చేశామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అదానీ, అంబానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తలతో పోటీ పడేలా మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహిస్తామని ఆయన అన్నారు.

స్థానికంగా చక్కెర పరిశ్రమ ఏర్పాటు కోసం రైతులు సహకార సంఘంగా ఏర్పడితే, నిమ్జ్‌లో వంద ఎకరాల భూమి కేటాయించడంతో పాటు అవసరమైన నిధులు కూడా మంజూరు చేయిస్తానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ సభలో సీఎం చేసిన ప్రకటనలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## పెద్దమ్మగుడి వద్ద ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్, మే 22:ఎలాంటి ఆక్రమణలు ఉన్నా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా పెద్దమ్మ గుడి వద్ద ఆక్రమణలను హైడ్రా నేలమట్టం చేసింది. హైదరాబాద్?లో భూములను పరిరక్షించడమే లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా.. అదే బాటలో చర్యలు తీసుకుంటుంది. బుధ, గురువారాల్లో మేడిపల్లి పరిధిలో ఆక్రమణలు కూల్చేసిన హైడ్రా.. నేడు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి దగ్గర ఆక్రమణలను కూల్చేసింది.

పెద్దమ్మగుడి పక్కన నాలాను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఉదయం ఆరు గంటల నుంచి కూల్చివేతలు కొనసాగాయి. నాలా పై నిర్మించిన నిర్మాణాలు, షెడ్లను కూల్చివేశారు. స్థానికుల ఫిర్యాదుతో సర్వే నిర్వహించిన అధికారులు.. నాలా ను ఆక్రమించి నిర్మించినట్లు గుర్తించారు. దీంతో 500 గజాలకు పైగా స్థలంలో నిర్మాణాలను కూల్చివేశారు

## గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కె. చంటిబాబు

మెహిదీపట్నం, మే 23 : ఆషాఢ మాసంలో జరిగే చారిత్రాత్మక గోల్కొండ బోనాలను ఘనంగా నిర్వహించడానికి శాయశక్తుల కృషి చేస్తానని ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు తెలిపారు. గోల్కొండ కోట జగదాంబ ఎల్లమ్మ ఆలయం ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులుగా నియమితులైన ఏడుగురితో ఆలయ ఈవో వసంత ప్రమాణ స్వీకారం చేయించారు. లంగర్‌హౌజ్‌కు చెందిన సీనియర్ నాయకులు కె.చంటిబాబు, ఆకుల ప్రదీప్ కుమార్, సంతోశ్ కుమార్, శ్రీకాంత్, యాదగిరి, అనితలు సభ్యులుగా, ఆలయన పూజారి సర్వేశ్‌చారి ఎక్స్అఫిషియో మెంబర్‌గా ప్రమాణం చేశారు. అనంతరం కె. చంటిబాబును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కె.చంటిబాబు మాట్లాడుతూ.. అందరి సహాయ సహకారాలతో జూన్ 26వ తేదీ నుంచి నెల రోజులపాటు జరగనున్న ఆషాడమాసం బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సలహాదారు, సంఘ సేవకులు సిరుగుమల్లె రాజు వస్తాద్, కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఉస్మాన్ బిన్ అల్ హాజరి, కూరాకుల కృష్ణ, వేణు గౌడ్, కుల వృత్తిదారుల సంఘం సలహాదారు సాయిబాబా చారి, అధ్యక్షులు శివశంకర్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి, మహంకాళి ఆలయ పూజారి సురేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి సంగమంలో జన ప్రవాహం

**-ఘాట్‌ల వద్ద భక్తుల పుణ్యస్నానాలు**
**-ట్రాఫిక్ జామ్.. క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు**
**-శైవక్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు**



భూపాలపల్లి, మే 23: మరో మూడు రోజుల్లో పుష్కర ఘట్టం ముగియనుంది. ఎండలు కూడా తగ్గుముఖం పట్టాయి. దీంతో భక్తులు తండోపతండాలుగా త్రివేణి సంగమం వద్దకు చేరుకుని పుణ్యస్నానం చేస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమంలోని అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలు తొమ్మిదో రోజుకు చేరుకుంది.

దక్షిణ భారత దేశంలో అంతర్వాహిని సరస్వతి నది ఒక్క కాళేశ్వరంలో ఉండడంతో.. దేశ నలుమూల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి పుష్కర స్నానాలు చేస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో త్రివేణి సంగమం భక్తులతో పోటెత్తింది. పుణ్యస్నానాలు చేసేవారు ఇక్కడ ఉన్న అమ్మవారు, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్నారు.

### గోదావరి మాతకు ప్రత్యేక పూజలు

పుష్కర స్నానం అనంతరం గోదావరి మాతకు మహిళలు పూజలు చేస్తున్నారు. పసుపు, కుంకుమ, పువ్వులు, కొబ్బరికాయలు తదితర పూజా సామగ్రితో పూజలు చేస్తున్నారు. పుష్కరఘాట్ వద్ద పెద్దలకు తర్పణాలు ఇస్తున్నారు.

మరికొందరు పిండ ప్రదానాలు చేస్తున్నారు. పుణ్యస్నానాలు అనంతరం చిన్నారు లు, విద్యార్థులతో ఏకశిల సరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు.

### అరణ్య శైవక్షేత్రంలో భక్తుల తాకిడి

అరణ్య శైవక్షేత్రంగా పేరొందిన శ్రీకాళేశ్వరం ముక్తీశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది.

ఉత్తర ద్వారం, తూర్పు ద్వారం ద్వారా భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరుతున్నారు.

ఈ క్రమంలో రూ.వంద టికెట్ ద్వారా శీఘ్ర దర్శనం రద్దు చేయడంతో అందరికి సర్వదర్శనం కల్పిస్తున్నారు. దివ్యాంగులను సిబ్బంది వీల్ చైర్ల ద్వారా దర్శనానికి తీసుకు వెళుతున్నారు.

### అన్నారం-పలుగుల రోడ్డులో ట్రాఫిక్ జామ్

పుష్కరాలు తొమ్మిదో రోజుకు చేరడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వాహనాలపై ఇక్కడకు వస్తున్నారు. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వన్‌వే రూట్ ఏర్పాటు చేసినా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. శుక్రవారం అన్నారం- పలుగుల రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ క్రమబద్దీ కరణను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించి చర్యలు చేపట్టారు. పూసుకుపల్లి నుండి ఉచిత బస్ సౌకర్యం ద్వారా భక్తులు రవాణాకు ఏర్పాట్లు, భక్తులు ఉచిత రవాణా సేవలు వినియోగించుకుని ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని సూచించారు.

# రైల్వేలు మన ఆర్థిక వ్యవస్థలో, మన గుర్తింపులో ఓ భాగం

## -కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని

న్యూఢిల్లీ, మే 23:భారతీయ రైల్వేలు మన ఆర్థిక వ్యవస్థలో భాగం మాత్రమే కాదనీ, మన గుర్తింపులోనూ ఒక భాగమేనని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరభివృద్ధి పనులు పూర్తి అయిన ఆంధ్రప్రదేశలోని సూళ్ళూరుపేట రైల్వే స్టేషనును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ఈ రోజు ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడారు. భారతీయ రైల్వేలు ప్రతి రోజూ రెండు కోట్ల మందికి పైగా ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయనీ, అంతేకాకుండా ప్రపంచంలో చాలా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న యాజమాన్య సంస్థ కూడా భారతీయ రైల్వేలనీ మంత్రి అన్నారు.

ప్రస్తుతం భారత్‌లో మౌలిక సదుపాయాల కల్పన అంటే అది ఒక్క సౌకర్యాల గురించే కాదనీ, అది విశ్వాసాన్ని పెంపొందించడం గురించి కూడానని మంత్రి వ్యాఖ్యానించారు. మనకు సులభంగా చేరుకోగలిగే, సమర్థమైన, మన దేశ గౌరవానికి అద్దం పట్టే స్టేషన్లు అవసరమని చెప్పారు. "గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, రైల్వేలకు భారత అభివృద్ధి కార్యక్రమాల పట్టికలో కీలక స్థానాన్ని ఇచ్చాం. ఆయన విధానం స్పష్టం. రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలలో మార్పు తీసుకురావాలి. ప్రయాణికులకు కలిగే అనుభూతులను పెంపొందించాలి. రైల్వే స్టేషన్లను మన దేశ పట్టణ ప్రాంత పునరుద్ధరణ కృషితో అనుసంధానించాలి" అని మంత్రి వివరించారు.

దేశంలో 1,300కు పైగా స్టేషనకు సరికొత్త రూపురేఖలను కల్పించాలనే ఉద్దేశంతో అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని రూపొందించినట్లు శ్రీ పెమ్మసాని తెలిపారు. రూ.14.5 కోట్ల ఖర్చుతో సూళ్ళూరుపేట రైల్వే స్టేషన్ పునరభివృద్ధి పనులను చేశారని తెలిపారు. ఈ స్టేషన్ పవిత్రమైన తిరుపతి జిల్లాలో ఉండడంతో భారతీయ రైల్వే చిత్రపటంలో ఈ స్టేషనుకు తనదైన ప్రత్యేక స్థానం ఉంది. అదీకాక, మన దేశంలో ప్రధాన స్పేస్‌పోర్టు అయిన శ్రీహరికోటకు చాలా దగ్గరగా ఉన్న రైల్వేస్టేషన్ కూడా సూళ్లూరుపేటయే.

గత 11 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన వివిధ రైల్వే ప్రాజెక్టులను గురించి మంత్రి ప్రస్తావిస్తూ... 2025?26లో బడ్జెటు కేటాయింపు రూ.9,417 కోట్లకు పెరిగిందనీ, ఇది 2009?14లో కేటాయించిన దాని కన్నా 10 రెట్లకు పైగానే అనీ తెలిపారు. మొత్తం 414 కిలోమీటర్ల కొత్త రైలు మార్గాలను జోడించారనీ, 1,217 కి.మీ. మేర రైలుమార్గాల డబ్లింగ్ పూర్తి చేశారనీ, మొత్తం 3,748 కి.మీ. మేర రైలుమార్గాన్ని విద్యుదీకరించారన్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీము ఒక్క దానిలో భాగంగానే, ఆంధ్ర ప్రదేశ్‌లో 73 స్టేషన్ల పునరభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఇదొక రికార్డనీ మంత్రి చెప్పారు.

# అక్రమ బొగ్గుగనిలోకి నది నుంచి వరద.. ముగ్గురు కార్మికులు దుర్మరణం

న్యూఢిల్లీ, వే 23:అక్రమ బొగ్గుగని లోకి నది నీళ్లు చేరడంతో ఆ గనిలో పనిచేస్తున్న వాళ్లలో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్ జిల్లాలోని బరియాటు ఖావా ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వారి మృతదేహాలను వెలికి తీసేందుకు గాలింపు కొనసాగుతోంది.

ఖావా నదిలో ముగ్గురు కూలీలు గల్లంతైనట్లు గురువారం సాయంత్రం తమకు సమాచారం అందిందని స్థానిక పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే తాను ఘటనా ప్రాంతానికి వెళ్లి చూశామని, అక్కడ ఒక భారీ గుంత ఉన్నదని తెలిపారు. దాన్నిబట్టి ఆ ప్రాంతంలో అక్రమంగా బొగ్గు తవ్వకం జరుగుతున్నదనే విషయం స్పష్టమవుతోందని చెప్పారు. ప్రస్తుతం నదిలో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నామని అన్నారు.

ప్రత్యేక మిషన్ ద్వారా అక్రమ మైనింగ్ గుంతలోని నీటిని బయటికి పంపింగ్ చేస్తున్నామని పోలీసులు చెప్పారు. నీరు తొలగిపోతే మృతదేహాలు దొరికే ఛాన్స్ ఉందని అన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# పోరాటాల ద్వారానే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం : గుగులోతు రామకృష్ణ



ఖమ్మం, మే 23: పోరాటాల ద్వారానే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ అన్నారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ బోనకల్లు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ? గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బిల్లులు అన్నింటిని క్లియర్ చేయాలన్నారు. అదేవిధంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు నియామక తేదీని అక్టోబర్ 10గా పరిగణించాలని, డీఎస్సీ 2008 టీచర్లకు జీతాలు ఇవ్వాలని, వారిని విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం, విద్యార్థుల నమోదు పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇందులో సమాజం కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. గురుకుల పాఠశాలల సమయపాలనను మార్చాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకుడు సద్దా బాబు, మండల అధ్యక్షుడు చిన్న రంగారావు, ఉపాధ్యక్షుడు వి.గోపాలరావు, కోశాధికారి జె.కోటయ్య, మండల కార్యదర్శులు పి.నరసింహారావు, కె.సురేశ్, ఉయ్యాల రామారావు, ఎం.నిర్మల, కె.పద్మావతి, ఎం.నరేంద్ర సింహం, యు.గంగాభవాని, ఎం.లవకుశ పాల్గొన్నారు.

# తడిసిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్



ఆదిలాబాద్, 23: ఇటీవల కురిసిన వర్షాలతో వరి,జొన్న పంటలు తడిసాయని ,రైతులు నష్టపోకుండా ప్రభుత్వం తడిసిన పంటలను కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా జొన్నలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, తడిసిన ప్రతీ ధాన్యం గించను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ తరపున ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉప సర్పంచులు దేవేందర్ రెడ్డి, శిరీష్ రెడ్డి, కృష్ణ రెడ్డి, సురేందర్ యాదవ్, ప్రశాంత్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి - అడిషనల్ కలెక్టర్ మోతిలాల్

ఆదిలాబాద్, 23: వర్షాలు ప్రారంభమవుతున్న దృష్ట్యా ధాన్యం కొనుగోళ్ల లో వేగం పెంచాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ అధికారులకు సూచించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బొప్పారం సర్వాయిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు.

వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను ఇబ్బందులు గురి చేయవద్దని, సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ రాఘవేంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థులకు అన్యాయం

## -సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్లపై ఏపీ సర్కార్ కొర్రీలు
## -తెలంగాణ విద్యార్థులను నాన్‌లోకల్‌గా పరిగణిస్తామని వెల్లడి
## -ప్రశ్నార్థకంగా 20వేల మంది విద్యార్థుల భవితవ్యం
## క్రాంతి కీన్ ఫౌండేషన్ సహాయ కార్యదర్శి కల్యాణి




హైదరాబాద్, మే 22:సైనిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం పరీక్షలు రాసిన తెలంగాణ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని క్రాంతి కీన్ ఫౌండేషన్ సహాయ కార్యదర్శి కల్యాణి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలను అన్ని రాష్ట్రాల నుంచి విద్యార్థులు రాస్తారన్నారు. ఈ ఏడాది కూడా తెలంగాణకు చెందిన విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్‌లోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్ ద్వారా పరీక్షలు రాశారన్నారు.

ఏప్రిల్‌లో హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు జరిగాయన్నారు. అదే నెల చివరాఖరులో కోరుకొండ సైనిక్ స్కూల్ వెబ్‌సైట్‌లో యాజమాన్యం వేసిన పోస్టులు విద్యార్థులకు తీరని బాధను కలిగించిందన్నారు. అందులో తెలంగాణకు చెందిన పిల్లలను స్థానికులుగా గుర్తించమని, స్థానికేతరుల కేటగిరిలోకి వస్తారని పేర్కొన్నారన్నారు. దీంతో పరీక్షలు రాసిన తెలంగాణకు చెందిన దాదాపు 20వేల మంది విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇక్కడ ఒక ప్రత్యేక సైనిక్ స్కూల్ లేని కారణంగా ఈ సంవత్సరం రాసిన విద్యార్థులకు లోకల్ కోటాలో అవకాశం కల్పిస్తే వారి భవిత నిలబడుతుందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి..

ఇప్పటికే కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి ఈ విషయమై వినతి పత్రాలు సమర్పించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా చొరవ తీసుకొని ఇక్కడ సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బాధిత విద్యార్థి తండ్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నా బిడ్డను సైనిక్ స్కూల్‌లో చేర్పించాలన్న ఉద్దేశ్యంతో కోచింగ్ కూడా ఇప్పించానని, స్థానికేతరులుగా ప్రకటించడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

ఫౌండేషన్ లీగల్ సెల్ ప్రతినిధి జాకబ్ మాట్లాడుతూ.. ఎంట్రన్స్ పరీక్షలు అయిన తర్వాత స్థానిక అంశంలో నోటిఫికేషన్ విడుదల చేశారని, తద్వారా 20వేల మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికే విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పిల్లలతో పోటీ ఉండటం వల్ల తెలంగాణ వారికి 98శాతం మార్కులు వచ్చినా ఫలితం ఉండదన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఈ ప్రాంతంలోని విద్యార్థులు ఆ పాఠశాలలపైనే ఆధారపడి ఉన్నారన్నారు. ఈ ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులకు లోకల్ కేటగిరిలోనే ప్రవేశాలు ఇవ్వాలన్నారు. ఇక్కడి విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కనీసం మూడు సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

# టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దివాకర్ రెడ్డి ప్రమాణం



తిరుపతి, 23: టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దివాకర్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అదనపు ఈవో శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో ప్రశాంతి, వీజీవో సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల ఆకలి కేక మహాసభను విజయవంతం చేయాలి : జేఏసీ ప్రణాళిక చైర్మన్ ముఖేష్ గౌడ్

హైదరాబాద్, మే 22: ఈ నెల 27న హైదరాబాద్‌లో జరిగే ఆటో డ్రైవర్ల ఆకలి కేక మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ కోరారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆటో యూనియన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు కలుపుకొని ఆటో కార్మికుల ఆకలి కేక యాత్ర ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. యాత్ర ముగింపు సందర్భంగా మే 27 చలో హైదరాబాద్ ఆటో కార్మికుల ఆకలి కేక మహాసభ ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లు, కార్మికులు, నాయకులు వేలాదిగా స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఇప్పటికైనా ఆటో కార్మికులకు ప్రతినెల రూ.12 వేలు, ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.1000 కోట్లు, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు సహజ మరణం చెందితే రూ.ఐదు లక్షల ఇచ్చి ఆదుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ మురళీధర్, పొట్ట మధుకర్, కల్వల అంజయ్య, పగడాల రాజేష్, ఎండి షఫీ, తగరం శ్రీనివాస్, మంతెనగట్టయ్య, కలవేని శేఖర్, బోరే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# 47వ ఫ్లైట్ టెస్ట్ కోర్సు ఆఫీసర్స్ గ్రాడ్యుయేషన్ విత్ ఫ్లయింగ్ కలర్స్

న్యూఢిల్లీ, మే 23:మే 23, 25న, బెంగళూరులోని ఎయిర్‌క్రాఫ్ట్ అండ్ సిస్టమ్స్ టెస్టింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (యాఇ)లో జరిగిన "సురంజన్ దాస్ డిన్నర్'' అనే ఉత్సవ వీడ్కోలు కార్యక్రమంతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్ స్కూల్ యొక్క ప్రతిష్ఠాత్మక 47వ ఫ్లైట్ టెస్ట్ కోర్సు ముగిసింది.

ఎయిర్ స్టాఫ్ చీఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఒఖ సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ డిమాండ్ మరియు ప్రత్యేక కోర్సులో వారి అసాధారణ పనితీరును గుర్తించి, గ్రాడ్యుయేషన్ అధికారులకు ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్లను ఆయన ప్రదానం చేశారు. ఫ్లైట్ టెస్ట్ కోర్సు 48 వారాల పాటు కఠినమైన శిక్షణకు ప్రసిద్ధి చెందింది మరియు అత్యాధునిక వైమానిక వేదికలు మరియు వ్యవస్థల కోసం దేశం యొక్క విమాన పరీక్ష సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఇది ఒక మూలస్తంభం.ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ తన ప్రసంగంలో, టెస్ట్ ఫ్లయింగ్ ఒక ప్రత్యేక డొమైన్‌గా కీలక పాత్రను హైలైట్ చేశారు, దీనికి అత్యున్నత ప్రమాణాల వృత్తిపరమైన సామర్థ్యం, ??సమగ్రత మరియు సేవ పట్ల అంకితభావం అవసరం. భారత వైమానిక దళం స్వావలంబనకు నిబద్ధతను నొక్కి చెబుతూ, అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఒఐఅం) మరియు ఒఅం ఓఇ-ఎవ వంటి అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా స్వదేశీకరణ ప్రయత్నాలను ఆయన నొక్కి చెప్పారు. సశక్త, సక్షం మరియు ఆత్మనిర్భర్ భారత్‌ను రూపొందించడంలో అవసరమైన ప్రెసిషన్ మరియు ఎక్సలెన్స్ యొక్క ప్రధాన విలువలను నిలబెట్టాలని గ్రాడ్యుయేషన్ అధికారులకు ఆయన పిలుపునిచ్చారు.

# BSF సరిహద్దులో ఉన్నంత వరకు, పాకిస్తాన్ సైన్యం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగదు




న్యూఢిల్లీ, మే 23:కేంద్ర హోంమంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన సరిహద్దు భద్రతా దళం (బాఈ) ఇన్వెస్టిచర్ వేడుక మరియు రుస్తంజీ స్మారక ఉపన్యాసానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఏఃఇ) డైరెక్టర్ మరియు సరిహద్దు భద్రతా దళం డైరెక్టర్ జనరల్ సహా అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో, 1965 నుండి 2025 వరకు బాఈ ప్రయాణం సవాలుతో కూడిన పరిస్థితులలో పరిమిత వనరులతో ప్రారంభమైన ఒక సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద మరియు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సరిహద్దు భద్రతా దళంగా ఎలా ఉద్భవించిందో చూపిస్తుంది. ప్రపంచ స్థాయిలో రాణించడానికి దేశభక్తి అన్ని ఇబ్బందులను ఎలా అధిగమించగలదో BSF అత్యుత్తమ ఉదాహరణ అని ఆయన అన్నారు. ప్రతికూల పరిస్థితులలో - అది 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు లేదా చాలా తక్కువ, దట్టమైన అడవులు, కఠినమైన పర్వతాలు లేదా తీరప్రాంతాలు కావచ్చు - బాఈ సిబ్బంది చూపించిన దేశభక్తి మరియు అంకితభావం BSF కు మొదటి రక్షణ రేఖ అనే గౌరవాన్ని సంపాదించిపెట్టిందని ఆయన హైలైట్ చేశారు. ప్రతి సరిహద్దును భద్రపరచడానికి ఒక దళాన్ని కేటాయించాలని దేశంలో నిర్ణయం తీసుకున్నామని, బాఈ సామర్థ్యం ఆధారంగా, అత్యంత సవాలుతో కూడిన రెండు సరిహద్దులను, బంగ్లాదేశ్ మరియు పాకిస్తాన్‌ను భద్రపరిచే బాధ్యతను దానికి అప్పగించామని శ్రీ షా అన్నారు.

\ కె.ఎఫ్. బీఎస్ఎఫ్‌ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన రుస్తమ్‌జీ గురించి మాట్లాడుతూ, 1965 యుద్ధం తర్వాత, శాంతి సమయంలో కూడా సరిహద్దులను భద్రపరచగల శక్తి అవసరం ఏర్పడిందని, దీని ఫలితంగా బీఎస్ఎఫ్ ఆవిర్భావం జరిగిందని, రుస్తుమ్‌జీ దాని మొదటి డైరెక్టర్ జనరల్ అయ్యారని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అన్నారు.

1971లో భారతదేశంపై రుద్దబడిన యుద్ధంలో బాఈ సిబ్బంది చూపిన ధైర్యసాహసాలు మరియు సహకారాలను దేశం ఎప్పటికీ మరచిపోదని, బంగ్లాదేశ్ దానిని ఎప్పటికీ మరచిపోకూడదని ఆయన అన్నారు. బంగ్లాదేశ్ సృష్టిలో బాఈ గణనీయమైన పాత్ర పోషించిందని మరియు అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడడంలో సాయుధ దళాలతో భుజం భుజం కలిపి నిలబడి ధైర్యసాహసాలకు ఆదర్శప్రాయమైన ప్రమాణాన్ని నెలకొల్పిందని శ్రీ షా నొక్కిచెప్పారు.

సరిహద్దు భద్రతతో పాటు, అంతర్గత భద్రత, విపత్తు నిర్వహణ మరియు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో బాఈ చురుకుగా పాల్గొని ఫలితాలను సాధించిందని శ్రీ అమిత్ షా అన్నారు. ఎన్నికలు అయినా, కోవిడ్-19 మహమ్మారి అయినా, క్రీడా కార్యక్రమాలు అయినా, ఉగ్రవాదం మరియు నక్సలిజాన్ని ఎదుర్కోవడమైనా, బాఈ తాను మోహరించిన ప్రతి రంగంలోనూ తన విధులను అసాధారణంగా చక్కగా నిర్వర్తించిందని ఆయన పేర్కొన్నారు.

లకేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి మాట్లాడుతూ, BSF మరియు సాయుధ దళాలు ప్రపంచం ముందు అసమానమైన శౌర్య ఉదాహరణను అందించిన సమయంలో నేటి ప్రవేశ కార్యక్రమం జరుగుతోందని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృఢ రాజకీయ సంకల్పం, ఏజెన్సీల నుండి వచ్చిన ఖచ్చితమైన నిఘా సమాచారం మరియు మన దళాల ప్రాణాంతక సామర్థ్యాలకు ఆపరేషన్ సిందూర్ ఒక అద్భుతమైన నిదర్శనమని ఆయన అన్నారు. దశాబ్దాలుగా మన దేశం పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోందని, సంవత్సరాలుగా పాకిస్తాన్ అనేక ఉగ్రవాద దాడులను నిర్వహించిందని, కానీ వాటికి తగిన విధంగా స్పందించలేదని ఆయన అన్నారు.

# నెట్టెంపాడు ప్రాజెక్టు భూసేకరణ పనులు పరిశీలించిన కలెక్టర్

మహబూబ్‌నగర్, 3: ధరూర్ మండలంలోని చింతరేవుల గ్రామంలోని జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ భూసేకరణ పనులను జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వివరాలు, లేఅవుట్ మ్యాప్, పెగ్ మార్కింగ్ చేసిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సర్వే పనులకు నిధుల కొరత లేదని, ఏ విధమైన ఆలస్యం లేకుండా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఎంత మేర భూమిపై సర్వే జరుగుతోంది. ఎన్ని ఎకరాలు పూర్తయ్యాయి. అనే వివరాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.

సర్వే, పెగ్ మార్కింగ్ పనులను ఒకేసారి జరుపుతూ రైతులను చైతన్యపరచి వారి సహకారంతో భూసేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే ల్యాండ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, నీటి పారుదల శాఖ ఎస్ఈ రహీముద్దీన్,ఆర్డీవో శ్రీనివాసరావు, ధరూర్ తహసీల్దార్ భూపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




# పాక్ కు యురోపియన్ దేశాల మద్దతు - ఆగ్రహం వ్యక్తం చేసిన జైశంకర్



న్యూఢిల్లీ, మే 23:ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ విషయంలో ఐరోపా దేశాలు అనుసరిస్తున్న వైఖరిని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా విమర్శించారు. పాకిస్థాన్‌లో సైనిక పాలన కొనసాగుతున్నప్పటికీ, సరిహద్దుల్లో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నప్పటికీ కొన్ని పశ్చిమ దేశాలు పాక్‌కు మద్దతుగా నిలవడాన్ని ఆయన తప్పుబట్టారు. జర్మని పర్యటనలో ఉన్న ఆయన నేడు ఆ దేశానికి చెందిన ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కశ్మీర్ సరిహద్దుల వెంబడి పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతూనే ఉందని జైశంకర్ గుర్తుచేశారు. ఈ ఎనిమిది దశాబ్దాల కాలంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కలిగిన ఐరోపా దేశాలు, పాకిస్థాన్‌లోని సైనిక పాలకులకు అండగా నిలిచాయని విమర్శించారు. పశ్చిమ దేశాల నుంచి లభించినంత మద్దతు పాకిస్థాన్‌కు మరెక్కడి నుంచీ రాలేదని ఆయన అన్నారు.

సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందన్న విషయాన్ని భారత్ అనేకసార్లు ఐరోపా దేశాల దృష్టికి తీసుకెళ్లింది. అయినప్పటికీ, 2004లో అమెరికా పాకిస్థాన్‌ను తమ ప్రధాన నాటోయేతర మిత్రదేశంగా గుర్తించింది. ఈ గుర్తింపు ద్వారా కీలకమైన వ్యూహాత్మక భాగస్వాములకు సైనిక, ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని, ఉగ్రవాదంపై తాము చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అప్పట్లో తన చర్యను సమర్థించుకుంది. అయితే, అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంపై భారత్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఈ పరిణామాలన్నింటినీ ఉద్దేశించే జైశంకర్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

నెదర్లాండ్స్‌కు చెందిన మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా జైశంకర్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలో జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల గురించి పాకిస్థాన్‌కు తెలియదనే వాదనను ఆయన తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ ప్రభుత్వం, ఆ దేశ సైన్యం రెండూ ఉగ్రవాద కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమై ఉన్నాయని ఆయన ఆరోపించారు.

# నకిలీ విత్తనాల రవాణా,ఉత్పత్తి విక్రయాలపై ప్రత్యేక నిఘా

## -జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల, 23: (నేటినిజం ప్రతినిధి): జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా,రవాణా, ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం అందింతే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకురైతులకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో వుంచుకోని రైతన్న నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకై జిల్లా పోలీసులు సిద్ధంగా ఉందని నకిలీ విత్తనాల సరఫరా,ఉత్పత్తి,అమ్మకాలు అరికట్టడానికి వ్యవసాయ శాఖ,జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తరచు తనిఖీలు చెప్పట్టడం జరుగుతుందన్నారు.

జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి పోలీస్,వ్యవసాయ అధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారియెక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందన్నారు.నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మిన,రవాణా చేసే వ్యక్తుల పై క్రిమినల్ కేసులు,పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు.

జిల్లాలో ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ, పోలీసు అధికారులు పై ఉంటుందని,జిల్లా పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ షాప్, సీడ్స్ షాప్స్ లపై నిఘా ఉంచి ఆకస్మిక తనికిలు చేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను,రవాణాను అడ్డుకట్ట వేయడం జరుగుతుందని,రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుండి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రజలకు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు,నకిలీ పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే డయల్100 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

# హైదరాబాద్‌లో తెలంగాణ తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను ప్రారంభించిన ఆప్ట్రోనిక్స్



హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారతదేశంలో అతిపెద్ద ఆపిల్ ప్రీమియం రీ సెల్లర్ అయిన ఆప్ట్రోనిక్స్, తెలంగాణ తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో వైభవంగా ప్రారంభించినట్లు వెల్లడించింది.ఈ స్టోర్, పూర్తి స్థాయిలో మార్పు చేయబడింది. ఈ స్టోర్‌లో ఇప్పుడు ప్రత్యేకమైన ఆపిల్-అధీకృత సర్వీస్ సెంటర్ కూడా ఉంది, ఇది ఒకే చోట సమగ్రమైన ఆపిల్ అనుభవాన్ని అందించనుంది. ఈ స్టోర్ ప్రారంభం ఆప్ట్రోనిక్స్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణలోని ఆపిల్ రిటైల్ కార్యకలాపాలకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. దాని మెరుగైన డిజైన్ మరియు వృద్ధి చేయబడిన కస్టమర్ అనుభవంతో, ఈ కొత్త ప్రీమియం పార్టనర్ స్టోర్ ఆపిల్ యొక్క ఉత్తమ ప్రపంచ రిటైల్ ప్రమాణాలను కలిగి ఉంది. ఆవిష్కరణలు, లీనమయ్యే సేవను కలుసుకునే ప్రాంగణాన్ని సృష్టిస్తుంది.ప్రత్యేక మైన ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా, స్టోర్‌ను సందర్శించే కస్టమర్‌లు తాజా ఐఫోన్‌లు, మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌లు మరియు ఉపకరణాలతో సహా ప్రతి ఉత్పత్తిపై కనీసం 12% తగ్గింపును పొందవచ్చు. వేడుకలు అక్కడితో ఆగవు:

”ఆపిల్ యొక్క రిటైల్ లక్ష్యంను ప్రతిబింబించే రీతిలో తీర్చిదిద్దిన స్టోర్‌తో ఆపిల్ ప్రీమియం పార్టనర్ అనుభవాన్ని హైదరాబాద్‌కు తీసుకురావడానికి మేము సంతోషిస్తున్నామని, ఈ ప్రారంభం ఆపిల్ యొక్క తాజా సాంకేతికతకు అసాధారణమైన సేవ , లభ్యతను అందించడంలో మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది” అని ఆప్ట్రోనిక్స్ వ్యవస్థాపకుడు సుతీందర్ సింగ్ అన్నారు.”తెలంగాణలో మొట్టమొదటి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు.. ఇది స్టోర్ కంటే ఎక్కువ – ఇది మా బ్రాండ్ నైతికత , మా కస్టమర్‌లు మాపై ఉంచిన నమ్మకానికి ఒక వేడుక. ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్ మరియు ప్రత్యేకమైన “తెలంగాణలో మొట్టమొదటి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నాము. ఇది స్టోర్ కంటే ఎక్కువ – ఇది మా బ్రాండ్ నైతికత , మా కస్టమర్‌లు మాపై ఉంచిన నమ్మకానికి ఒక వేడుక. ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్ మరియు ప్రత్యేకమైన ప్రారంభోత్సవ ఆఫర్‌లతో, మా కస్టమర్‌ల కోసం యాపిల్ కొనుగోలు , యాజమాన్య అనుభవాలను పెంచడానికి మేము సంతోషిస్తున్నామన్నారు.” అని ఆప్ట్రోనిక్స్ సీఈఓ మేఘనా సింగ్ అన్నారు.ఇనార్బిట్ మాల్‌లోని కొత్త స్టోర్ అత్యాధునిక ఆపిల్ ఉత్పత్తులకు కేంద్రంగా మాత్రమే కాకుండా, సౌకర్యవంతమైన సేవ మరియు నిపుణుల సలహా కోసం గమ్యస్థానంగా కూడా పనిచేస్తుంది. మీరు మీ మొదటి ఐఫోన్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నా లేదా పాత మ్యాక్‌బుక్‌ను విక్రయించాలనుకుంటున్నా , ఆప్ట్రోనిక్స్ ఇనార్బిట్ ప్రతి కస్టమర్ ప్రయాణం ప్రీమియం అని నిర్ధారిస్తుంది.ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవాన్ని వేడుక జరుపుకోవడానికి మీరందరూ మాతో చేరాలని మేము ఆహ్వానిస్తున్నాము. ఈ గర్వించదగ్గ క్షణంలో భాగం అవ్వండి , తెలంగాణలో ఆపిల్ రిటైల్ భవిష్యత్తు కార్యకలాపాలను ఆస్వాదిస్తూ ప్రత్యేకమైన ఆఫర్‌లను సొంతం చేసుకోండి.హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లోని ఆప్ట్రోనిక్స్‌ను సందర్శించండి – ఇక్కడ ఆవిష్కరణలు శ్రేష్ఠతను కలుస్తాయి.నిబంధనలు ఒ షరతులు వర్తిస్తాయి.

# షురూ యాప్ సిరీస్ ఏ నిధులను సేకరించి

## ఏ ఐ ఆధారిత హైపర్ లోకల్ ఇన్నోవేషన్ వేగవంతం

హైదరాబాద్ । మే 23, 2025: భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హైపర్ లోకల్ ప్లాట్‌ఫారమ్‌లలో ఒకటైన షురూ యాప్, తమ టెక్నాలజీ విస్తరణ తదుపరి దశకు సిరీస్ ఎ నిధులను సేకరించింది. ఈ రౌండ్‌కు క్రాఫ్టన్ నేతృత్వం వహించగా, ఒమిడ్యార్ నెట్‌వర్క్ ఇండియా, ఎక్సిమియస్ వెంచర్స్ ఇందులో పాల్గొన్నాయి అని షురూ యాప్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు మయాంక్ భంగడియా తెలిపారు.ఈ నిధులతో, సంఘాల సంభాషణల నుండి రియల్-టైమ్, ప్రాంతీయ సమాచారం అందించగల కొత్త ఏఐ-పవర్డ్ ట్రెండ్స్ ఇంజిన్‌ను ప్రారంభించడానికి ఉపయోగిస్తారు. 6.5 లక్షల స్థానాల్లో 2 మిలియన్లకు పైగా వినియోగదారులతో, భారతదేశంలోని



పక్కపక్కనున్న ప్రాంతాలు ఎలా కనెక్ట్ అవుతున్నాయో, ఎలా మాట్లాడుతున్నాయో, ఎలా స్పందిస్తున్నాయో అన్న విషయాలను లోతుగా అర్థం చేసుకునే ఇంటెలిజెన్స్‌ను షురూ తయారు చేస్తోంది అన్నారు.

# తెలంగాణలో కరోనా కలకలం..

## హైదరాబాద్‌లో కొవిడ్ కేసు నమోదు

హైదరాబాద్, మే 22:తెలంగాణలో మళ్లీ కరోనా కలకలం సృష్టిస్తున్నది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వైద్యుడికి ఆర్టీపీసీఆర్ టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చిందని వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన్ను క్వారంటైన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు ఏపీలోనూ కరోనా వైరస్ విస్తరిస్తున్నది. అక్కడ రెండు కేసులు నమోదయ్యాయి. తొలుత వైజాగ్ మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. చలిజ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కొవిడ్ 19గా తేలింది.. అలాగే నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేయగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

# కెసీఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా

## -కెటిఆర్, హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారు

## –మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి

హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ఆర్టిఫిషియల్ లేఖను కూడా సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ప్రపంచ వేదికపై భారతీయ సంస్కృతి..

## –నీతా అంబానీ కీలక ప్రకటన

ముంబై మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారతీయ కళలను పరిక్షించడానికి రిలయన్స్ సంస్థ అధ్యక్షుడు ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ “నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఎసిసి)”ను 2023 మార్చి 31న ఏర్పాటు చేశారు. తాజాగా ఈ సంస్థ కీలక ప్రకటన చేసింది. న్యూయార్క్ నగరంలో “నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ఇండియా వీకెండ్” కార్యక్రమాన్ని జరపనున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 12 నుంచి 14 వరకూ నిర్వహించనున్నారు. లింకన్ సెంటర్ ఫర్ ది పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సంగీతం, థియేటర్, ఫ్యాషన్, వంటకాలతో వివిధ భారతీయ కళారూపాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నారు. ఈ ఇండియా వీకెండ్ మొదటి ఎడిషన్‌తో అంతర్జాతీయంగా ఓ మైలురాయి అరంగేట్రం చేయనుంది.మూడు రోజుల ఈ వేడుకలో ‘ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్ : సివిలైజేషన్ టు నేషన్’ ముఖ్యమైనది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద థియేట్రికల్ ప్రొడక్షన్. ఇందులో దాదాపు 100 మందికి పైగా కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు. వీరిలో టోనీ, ఎమ్మీ అవార్డులు అందుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఈ కార్యక్రమం గురించి నీతా అంబానీ మాట్లాడుతూ.. భారతదేశపు అత్యుత్తమ కళలను ప్రపంచానికి ప్రదర్శించడమే ఎన్ఎంఎసిసి ప్రధాన లక్ష్యమని అన్నారు. న్యూయార్క్‌లో జరిగే ఈ మూడు రోజుల వేడుక తమ ప్రయాణంలో మొదటి అడుగు అవుతుందని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక లింకన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరగడం.. అందులో మన గొప్ప సంస్కృతిని పంచుకోవడానికి ఉత్సహంగా ఉందని అన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..

## ట్రైనీ ఎస్సై సాయికృష్ణ

కరీంనగర్, మే 23:ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ ఎస్సై సాయికృష్ణ విత్తన డీలర్లను హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ షాపుల యజమానులతో ఏఓ గణేష్ తో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మకూడదని, గుర్తుతెలియని వ్యక్తులకు పురుగు మందులు, క్రిమినాశకాలు అమ్మ కూడదని సూచించారు.పురుగు మందులు అమ్మేటపుడు రైతు ఆధార్ కార్డు, పాస్ బుక్ జీరాక్స్ ఫోన్ నెంబర్ తీసుకొని రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. సరైన లైసెన్సు ఉన్నవారే అమ్మకాలు జరపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు, అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్‌ను గుర్తిస్తున్నాం : డీజీపీ జితేందర్

హైదరాబాద్, మే 22: హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్‌ను గుర్తిస్తున్నామని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. ఉగ్ర కుట్రసూత్రధారి సమీర్ కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. స్లీపర్ సెల్స్ గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉగ్రకుట్రకు ఒక గ్రూప్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశాయగా.. ఏర్పాటు దశలోనే గ్రూప్‌ని కనిపెట్టి విచ్ఛిన్నం చేసినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ఆపరేషన్‌ను కేంద్ర బలగాలే నిర్వహించాయన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు 300 మంది మావోయిస్టులు లొంగిపోయారని, రాష్ట్రంలో మావోయిస్టులు ఇంకెవరైనా ఉంటే వెంటనే లొంగిపోవాలని కోరారు.

# సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్, రిమాండ్

## - సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ

రాజన్న సిరిసిల్ల, 23: (నేటినిజం ప్రతినిధి): సీసీ కెమెరాల




ఆధారంగా దొంగతనానికి పాల్పడ్డ కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన వేల్పుల రాజేశ్వర్ రెడ్డిని వ్యక్తి అరెస్ట్, రిమాండ్ చేసినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణతెలిపారు. నిందితుని వద్ద నుండి బంగారు ఆభరణాలు:48.47 గ్రాములు స్వాదిన పరుచుకునట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ బోయినిపల్లి మండలము జగ్గారావు పల్లి గ్రామానికి మే 25 చెందిన కొమురయ్య అనే వ్యక్తి మే 12న తన భార్యతో కలసి సిద్దిపేటలో ఉన్న తన బంధువుల పెళ్ళికి వెళుండగా, సిరిసిల్ల బస్ స్టాండ్ లో తన భార్య యొక్క హాండ్ బ్యాగ్ లో నుండి బంగారు నల్ల పూసల తాడు, ఒక జత బంగారు చెవుల కమ్మలు, బంగారు వంక ఉంగరము, బంగారు చైన్ గల డబ్బను గుర్తు తెలియని దొంగలు దొంగిలించినారని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా బస్ స్టాండ్ లో ఉన్న సిసి కేమేరాల ఆధారంగా నిందితుని ఈరోజు సిరిసిల్లలోని పెద్దబజారులోని శివాలయం వద్ద అదుపులోకి తీసుకొని దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించడం జరగిందన్నారు.

# “హిందూ ఏక్త యాత్ర” ను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ, బిజెపి శ్రేణులకు ధన్యవాదాలు...

## -బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ...

కరీంనగర్, ఏప్రిల్ మే 23:(నేటినిజం ప్రతినిధి) హనుమాన్ జయంతి రోజున కేంద్ర మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన “ హిందూ ఏక్తాయాత్ర “ ను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ, బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్లో 12 సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన హిందూ ఏక్తా యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు , ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ పట్టణంలో అత్యంత వైభవంగా హిందూ ఏక్తాయాత్ర నేడు హిందువుల సంఘటితశక్తి కి దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. 22న హనుమాన్ జయంతి రోజున హిందూ ఏక్తాయాత్ర ఎంతో వైభవంగా జరిగిందని , వర్షాన్ని లెక్కచేయకుండా అశేష సంఖ్యలో తరలివచ్చిన హిందూ బంధువుల రాకతో



ఏక్తా యాత్ర గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు. ,రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా ఈ యాత్రలో పాల్గొన్నారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. యాత్ర విజయవంతం కోసం కృషిచేసిన బిజెపి నాయకులు కార్యకర్తలు అందరికీ యాత్రకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ కు రాష్ట్రపతి భవన్ నుంచి ఫోన్

హైదరాబాద్ మే 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మాచన రఘునందన్ ఈ.. పేరు ఉన్న వ్యక్తి ఓ సాదా సీదా ఉద్యోగి పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్.కాని ఆయన జనహితం కోసం, సామాజిక బాధ్యత గా సమాజ సేవ కూడా చేస్తున్నారు.వృత్తి లోనే ప్రవృత్తిని వెతుక్కొని.. సమాజ హితం కోసం తపిస్తున్న అధికారి గా పేరు తెచ్చుకున్నారు.22 ఏళ్లుగా పొగాకు నియంత్రణపై పోరాటం చేస్తున్న..రఘునందన్ కు.. తాజాగా రాష్ట్రపతి భవన్ అధికార వర్గాలు ఫోన్ చేశారు.మీ పొగాకు నియంత్రణ కృషి అభినందనీయం అని కొనియాడారు.ఈ సందర్భంగా ప్రత్యేక కథనం...

వృత్తి లోనే ప్రవృత్తి ని వెతుక్కున్నారు మాచన రఘునందన్. సగటు మనిషిపై వ్యసన పరుడిగా..ముద్ర వేస్తున్న పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకం గా..22 ఏళ్లుగా పోరాటం సలుపు తున్నారు. పొగాకు ఉత్పత్తుల బారిన పడుతూ ప్రాణాంతకమైన వ్యాధులను కొని తెచ్చుకోవద్దని చెప్తూ సమాజ శ్రేయస్సుకు పాటు పడుతున్నారు.పొగాకు ఉత్పత్తుల కు వ్యతిరేకంగా తనదైన రీతిలో పోరాటం చేస్తున్నారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అందరిలో అవగాహన కల్పిస్తున్నారు. పొగాకు.. వ్యసనపరుల బతుకుల్లో పొగ బెడుతున్న తీరును సామాజిక మాధ్యమాల ద్వారా వివరిస్తున్నారు.పొగాకు ఉత్పత్తులపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన రఘునందన్ సేవలు అభినందనీయం.

సామాజిక స్పృహతో..

రఘునందన్ మాచన..మేడ్చల్ జిల్లా కేశవరం వాస్తవ్యుడు. ఆయన తండ్రి అభిమన్యు ఆంగ్లభాషా పండితుడు. ఆయన రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి పురస్కారాన్నందుకున్నారు. అలా భావి పౌరులను తీర్చిదిద్దే క్రమంలో తనదైన సేవలు అందిస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరు గడించారు.

తండ్రికి తగ్గ కొడుకు అనిపించుకునేలా రఘునందన్ సమాజ శ్రేయస్సు కోసం తనవంతు కృషి చేస్తున్నారు. యువత పెడదోవ పట్టకుండా తనదైన రీతిలో స్పందిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారాయన. పౌర సరఫరాల శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా నిత్యం దాడులు, తనిఖీలు నిర్వ హించే అధికారులు ఎందరో ఉన్నారు.కానీ రఘునందన్ మాచన అలా కాదు. ఉద్యోగాన్ని తన విధిగానో, ఓ అధికారిగా



తాను నిర్వర్తించాల్సిన బాధ్యతగానో మాత్రమే భావించలేదాయన. అందులో మానవత దృక్పథాన్ని వెతుక్కున్నారు. సమాజాన్ని మార్చాలన్న తపన ఆయనలో కనిపిస్తుంది. అలా కమిట్‌మెంట్‌తో సామాజిక స్పృహతో పనిచేస్తుంటారు రఘునందన్.

సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తూ..

పొగాకు నియంత్రణపై రఘునందన్ సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోస్టులు అంతర్జాతీయంగా అన్ని సమాజాలను చేరుతూ ఆలోచింపజేస్తున్నాయి. ఎక్స్ ద్వారా ఆయన పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారం, జర్మనీ దేశస్తులను ఆకట్టుకోగా ప్రపంచ ఆరోగ్య సంస్థ తమ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా రఘునందన్‌ను ఆహ్వానించింది.

దేశం తరఫున పాల్గొనడం ఆనందాన్నిచ్చింది..

పంజాబ్ ఛండీగడ్‌లో జరిగిన పొగాకు నియంత్రణ అంతర్జాతీయ సదస్సులో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ గౌరవ ప్రతినిధిగా నేను పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. పొగాకు ఉత్పత్తుల వల్ల ఆరోగ్యానికీ, ఐశ్వర్యానికీ ముప్పు వాటిల్లక ముందే.. టుబాకోకు గుడ్ బై చెప్పాలన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాలని ఆశిస్తున్న వారిలో నేనొకణ్ని. నేను సుమారుగా రెండు దశాబ్దాలుగా పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నా.ఆ ఫలాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. రిసోర్స్ సెంటర్ ఫర్ టుబాకో కంట్రోల్ సంస్థ ‘టుబాకో కంట్రోల్ స్టాల్ వర్ట్’గా నా సేవలను గుర్తించిం ది. అమెరికాకు చెందిన హెల్త్ మ్యాగజీన్ పల్మనరీ మెడిసిన్ కూడా నా సక్సెస్‌ను గుర్తిస్తూ వావ్.. వెల్డన్ అని కొనియాడింది. ఇటీవల పలువురు నన్ను అభినందించడం ఆనందాన్నిచ్చింది. ఈ అభినందనలన్నీ నా బాధ్యతను మరింత పెంచాయి.

# పుంగనూరు నియోజకవర్గంను అన్నమయ్యలోకి కలుపుతూ నోటిఫికేషన్

చిత్తూరు, మే 23: మెరుగైన పరిపాలన, అభివృద్ధి దృష్ట్యా, ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిజన్ నుండి పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదం మండలాల మండలాలను, చిత్తూరు జిల్లాలోని చిత్తూరు రెవెన్యూ డివిజన్ నుండి రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను మదనపల్లె రెవెన్యూ డివిజన్ కింద ఉన్న అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలలో నివసిస్తున్న వారి నుండి అభ్యంతరాలు లేదా సూచనలను ఆహ్వానించారు. వీటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. అన్ని అభ్యంతరాలు లేదా సూచనలు ఇంగ్లీషు లేదా తెలుగులో లిఖితపూర్వకంగా ఉండాలన్నారు.

ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ముప్పై రోజుల గడువు ముగిసేలోపు లేదా అంతకు ముందుగా చిత్తూరు జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకునేలా పంపాలని కోరారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.